

సాక్షి
పల్నాడు
ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.5853 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 4,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 990 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేయండి

జిల్లా కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను తప్పనిసరిగా అధికారులంతా తనిఖీలు చేయాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యేక అధికారులు, విద్యాశాఖ, వసతి గృహ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారులంతా తప్పనిసరిగా జిల్లాలోని ప్రతి ఒక్క పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఫోర్టిఫైడ్ బియ్యం సరైన సమయానికి అందుతున్నాయా? అని ఆరా తీశారు. వారంలో ఒక రోజు అధికారులు తప్పనిసరిగా ఏదైనా ఒక పాఠశాలను సందర్శించాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయుడి సహకారం తీసుకొని రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలు, నివారణకు తీసుకున్న చర్యలు, రక్తహీనత తగ్గిన తర్వాత వారి ఆరోగ్య పరిస్థితి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. డే స్కాలర్ చదువుతున్న వారికి సైతం పరీక్షలు నిర్వహించి, ఫలితాల అనంతరం ఎనీమియా నివారణకు తల్లిదండ్రుల కమిటీతో సమావేశం నిర్వహించి పౌష్టికాహారం అందిస్తూ అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ పథకానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలు, ఈకేవైసీ పూర్తి చేయడానికి మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు వలంటీర్ల సహకారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో సిద్ధంగా ఉన్న లేఅవుట్లకు తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ కలిసి డీపీఆర్‌లు తయారు చేయాలన్నారు. ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి ఫిబ్రవరి 5వ తేదీలోపు వంద శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం 564.60 అడుగుల వద్ద ఉంది. ఇది 243.1976 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 8,280, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 21,040 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీరు పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 837.90 అడుగుల వద్ద ఉంది. ఇది 58.8171 టీఎంసీలకు సమానం.

7న జాబ్‌మేళా

ఈపూరు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ (సీడాప్) ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ గుంటూరులోని సీడాప్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జేఆర్‌పీ రామయ్య శనివారం తెలిపారు. ప్రముఖ ఇంజినీరింగ్ కంపెనీ, కేంబ్రిడ్జి కళాశాలలోని ఖాళీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. డిగ్రీ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసుగల నిరుద్యోగులు విద్యార్హత సర్టిఫికెట్ల నకలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 63020 96189, 0863–2950296 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధికి అగ్రతాంబూలం

రూ.1,154.47 కోట్ల జిల్లా పరిషత్ బడ్జెట్ ఆమోదం

- పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ బడ్జెట్ రూ.1,093 కోట్లు
- జిల్లా పరిషత్ బడ్జెట్ రూ.61.26 కోట్లు
- కోటప్పకొండ తిరునాళ్లకు రూ.60 లక్షలు కేటాయింపు
- టెన్త్ విద్యార్థులకు రూ.50 లక్షలతో అల్పాహారం
- వరికపూడిసెల ప్రాజెక్ట్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం
- కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళులర్పించిన జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.1,154 కోట్ల 47 లక్షలతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఆమోదించింది. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై జరిగిన చర్చలో హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో అభివృద్ధి కార్యక్రమాల కోసం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి మేరకు జెడ్పీ నిధుల నుంచి రూ.60 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 36,155 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించేందుకు రూ.61 లక్షల జెడ్పీ నిధులతో పంపిణీ చేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. దీనిపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు ఫిబ్రవరి 15 నుంచి సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రేవుల లీజు బకాయిలు రూ.62.79 కోట్ల మేరకు పేరుకుపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. జెడ్పీ అతిథిగృహాలకు నిర్ణయించిన అద్దెలు సక్రమంగా వసూలు కావడం లేదన్నారు.



జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా వేదికపై శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పల్నాడు జేసీ శ్యాంప్రసాద్



జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు

సమగ్ర గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ గ్రామాల్లో 117 పనులను రూ.6.37 కోట్లతో చేపట్టామని తెలిపారు. జెడ్పీటీసీలు సూచించిన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమంలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా, తాగునీటి కొరత ఉన్న గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు అందిస్తే పరిశీలించి నిధులు మంజూరు చేస్తామన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతుల విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేస్తున్నామని ప్రకటించారు. జిల్లా పరిషత్‌కు చెందిన ఆస్తుల పరిరక్షణతో పాటు, వాటి లీజుల ద్వారా జెడ్పీకి మరింత ఆదాయం వచ్చేలా జెడ్పీటీసీలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

నకిలీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి

నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు లేవనెత్తిన అంశంపై శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలను అరికట్టేందుకు సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాలు విక్రయదారులు, అధిక రేటుకు ఫర్టిలైజర్స్ విక్రయించే వారిపై నిరంతరం దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని కోరారు.

బొల్లాపల్లి దాహార్తిని తీర్చేందుకు రూ.12కోట్లు కేటాయించిన సీఎంకు ధన్యవాదాలు

బొల్లాపల్లి జెడ్పీటీసీ రామావత్ భీమిబాయ్ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలోని 20 గ్రామాల ప్రజలు తీవ్రమైన తాగునీటి సమస్యతో ఏళ్ల తరబడి పడుతున్న ఇబ్బందులను గత నెల 30న వినుకొండ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే రూ.12 కోట్లు కేటాయించడంపై సభాముఖంగా ధన్యవాదాలు తెలియజేశారు.

జెడ్పీ ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు చెందిన పొలాలు, చెరువులు, స్థలాలు, దుకాణాలు, ఇతర ఆస్తులకు సంబంధించిన లీజుల ధరలను పెంచి ఆదాయ మార్గాలను పెంపొందించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాలు అరికట్టడానికి జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు చానల్ విస్తరణ అనుమతులు తీసుకువచ్చిన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ, గుంటూరు చానల్ అభివృద్ధికి సంబంధించి పర్చూరు మండలంలో భూసేకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని కోరారు.

పెండింగ్ బిల్లులు మంజూరుకు చర్యలు

సభలో పలువురు జెడ్పీటీసీలు లేవనెత్తన అంశాలపై గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని, పనుల వివరాలను అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించారని తెలిపారు. నిధులు త్వరలోనే విడుదల చేస్తారన్నారు. కల్తీ విత్తనాలు, పురుగు మందులు అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తెలిపిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకొని వివరాలను తదుపరి జరిగే సమావేశానికి 15 రోజులు ముందుగానే సభ్యులకు అందించాలన్నారు.

- పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టుకు సంబంధించి సేకరించిన భూములకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో నకిలీ విత్తనాల వల్ల మిర్చి పంటను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పల్నాడు జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగు మందులు అరికట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.
- ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె ప్రాంతానికి చెందిన కళాతపస్వి, దర్శకుడు కె.విశ్వనాథ్ మృతికి సంతాపం ప్రకటించి సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, జెడ్పీ సీఈవో జె.మోహనరావు, బాపట్ల డీఆర్వో లక్ష్మీశివజ్యోతి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ జెడ్పీ చేపల చెరువుల లీజులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేబ్రోలు మండలంలోని వేజెండ్ల, చేబ్రోలులోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా లేదని జెడ్పీటీసీ బత్తుల అనురాధ సమావేశం దృష్టికి తీసుకురావడంతో తక్షణమే ఆయా పాఠశాలలను పరిశీలించి, తగు చర్యలు చేపట్టాలని డీఈవో పి.శైలజకు సూచించారు. విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వహణ సక్రమంగా లేని ఏజెన్సీలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

జెడ్పీ బడ్జెట్ స్వరూపం

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన 2022–23 సవరణ బడ్జెట్ రాబడుల కింద రూ.1098,24, 36,000లకు గాను, వ్యయం రూ.1096,97, 36,000 పోనూ మిగులు బడ్జెట్‌గా రూ.1,27, 00,000 చూపారు.

2023–24 అంచనా బడ్జెట్‌లో రాబడుల కింద రూ.1154,47, 42,000లకు గాను వ్యయం కింద రూ.1152,96, 71,000 పోను మిగులు బడ్జెట్ రూ.1,50, 71,000గా చూపించారు. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1,154–47 కోట్ల భారీ అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌లో జెడ్పీ వార్షిక బడ్జెట్ రూ.61.26 కోట్లు కాగా, మిగిలిన రూ.1093 కోట్లు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసే నిధులు, పనులకు సంబంధించినవి ఉన్నాయి. అయితే ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులు, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను జెడ్పీ ఆమోదించాల్సిన దృష్ట్యా జెడ్పీ బడ్జెట్‌లో కలిపి సభలో ప్రవేశపెట్టారు.

రూ.500 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాచర్ల: మాచర్ల పట్టణాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన రూ.500 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. శనివారం ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి సురేష్, పీఆర్కే, కలెక్టర్ లోతేటి శివశంకర్, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్కు సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమగ్ర మంచినీటి పథకానికి పూజా కార్యక్రమం నిర్వహించి పైలాన్‌ను ఆవిష్కరించారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణ శివారులోని గొర్రెలమండి ఎదురు రూ.403 కోట్లతో నిర్మించనున్న హైవేకు పీఆర్కేతో కలిసి మంత్రి సురేష్ శంకుస్థాపన నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తర్వాత రూ.కోటితో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు తురకా కిషోర్, అబ్దుల్ జలీల్, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, శ్రీనివాసశర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, వెల్దుర్తి ఎంపీపీ చింతా శివరామయ్య, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను పాల్గొన్నారు.



మంచినీటి పథకం పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ శివశంకర్ తదితరులు

అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ లక్ష్యం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శనివారం మాచర్ల పట్టణంలో పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మాట్లాడారు. తన నియోజకవర్గంలో పురపాలక సంఘం లేదని, మాచర్లనే తన సొంత పురపాలక సంఘంగా భావించి పూర్తిస్థాయి అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

అర్హత సాధిస్తే ఉపకారం

- నేడు జిల్లాలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష
- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జీవైఈవో వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కేంద్ర జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పథకాన్ని 2008లో ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ప్రతిభా పరీక్షను ఏటా పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాస్తుంటారు. ఇది చాలా కష్టతరం కావడంతో మంచి మార్కులు వస్తేనే ఉపకార వేతనం అందుతుంది. అందుకు ప్రత్యేక తరగతులకు హాజరవుతూ పోటీ పరీక్షకు విద్యార్థులు సిద్ధపడుతున్నారు.

8వ తరగతి వారికే..

ఎనిమిదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్ష రాసే అవకాశం ఉంది. ఇందులో అర్హత పొందిన వారికి పథకం వర్తింపజేస్తారు. 9, 10, ఇంటర్ రెండేళ్లు/ఐటీఐ చదివితే ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం విద్యార్థి వ్యక్తిగత ఖాతాలో జమవుతుంది. ఏటా పరీక్ష రాసే వారి సంఖ్య బాగా పెరుగుతోంది. ఈ ఏడాది పల్నాడు జిల్లా వ్యాప్తంగా 3,384 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ నెల 5న నిర్వహించే ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుంది.

రెండు విభాగాల్లో పరీక్ష..

- అర్హత పరీక్ష రెండు విభాగాల్లో ఉంటుంది.
- మొత్తం 180 మార్కులకు పరీక్ష.
- మొదటి విభాగంలో నంబర్ సిరీస్, అర్థమెటిక్ రీజనింగ్ 90 మార్కులకు ఉంటుంది.
- రెండో విభాగంలో 6, 7, 8 తరగతుల్లో గణిత, సామాన్య, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి 90 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- ప్రశ్నాపత్రం బహుళైచ్ఛిక విధానంలో ఇస్తారు.
- పరీక్ష మూడు గంటలు ఉంటుంది.

పరీక్షా కేంద్రాల పరిశీలన..

నేషనల్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దృష్ట్యా సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాలను సత్తెనపల్లి ఉపవిద్యాశాఖ అధికారి వి.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను చేపట్టారు. పోలీస్ బందోబస్తు ఉండేలా సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.3,600, మోడల్ ధర రూ.3,000 వరకు పలికింది.

వైఎస్సార్ సీపీలో చేరిన బీసీ వర్గాలు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మండలంలోని కొండూరు గ్రామంలో బీసీ వర్గాలకు చెందిన 15 కుటుంబాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే శంకరరావు శుక్రవారం రాత్రి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీకి చెందిన బీసీ కులాలవారు ఎమ్మెల్యేని కలిశారు. తాము మూడున్నరేళ్లలో వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా ఎంతో లబ్ధి పొందామని, తాము సీఎం జగన్‌మోహనరెడ్డికి అండగా ఉండదలుచుకున్నామని, పార్టీలో చేర్చుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మంచి పాలన అందించే వారికి ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. పార్టీలో చేరిన వారిలో గుదారి రామారావు, గంగారావు, పెదగంగారావు, వీరయ్య, జాస్తి మహర్షి, గంగరాజు, బత్తుల గంగయ్య, చిన గంగయ్య, గుదారి సుబ్బారావు, పుల్లారావు, వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసరావు ఉన్నారు. ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ రామాంజనేయులు, యార్డు మాజీ చైర్మన్ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రబాబు, పార్టీ నాయకులు అంబటి నారాయణ, చొప్పరపు రామయ్య, రంగా, శ్రీరాములునాయక్, ఎస్.వెంకాయమ్మ ఉన్నారు.

హైప్ కోసం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిచే ఆరోపణలు

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్.



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి సురేష్, పక్కన ఎమ్మెల్యే పిన్నెల్లి

మాచర్ల: రాష్ట్రంలో కావాలని టీడీపీ హైప్ కోసం ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నెల్లూరు జిల్లా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డిచే ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేయిస్తుందని, ఇది అత్యంత దారుణమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాచర్లలోని కేసీపీ అతిథిగృహం వద్ద శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు ట్రాప్‌లో పడిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బయటకు వెళ్లే ఉద్దేశంతోనే పార్టీపై బురద జల్లుతున్నారన్నారు. ఆధారాలు లేకుండా మాట్లాడటం అత్యంత దారుణమన్నారు. గతంలో 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబు చరిత్రను తెలుసుకోకుండా కోటంరెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పిన్నెల్లి మాట్లాడుతూ కౌన్సిలర్‌గా గెలవలేని కోటంరెడ్డి సీఎం జగన్ పుణ్యాన ఎమ్మెల్యే అయ్యారని, లోకేష్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ కావటం, ఎవరో ఒకరి ద్వారా ప్రచారాన్ని కోరుకుంటున్న టీడీపీకి నువ్వు బలిపశువు అయ్యావన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

దుర్గి: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన చిరుమామిళ్ల రామారావు (45) శనివారం స్థానిక తిరుపతమ్మ కుంట సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో మొక్కజొన్న పైరుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. వ్యవసాయ మోటార్‌ను ఆన్‌చేసి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవటంతో రామారావు భార్య వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. తోటి రైతుల సహాయంతో దుర్గిలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బంధువులు, మిత్రుల రోదనతో ఆ కుటుంబం విలవిలలాడింది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.